ప్రజాశక్తి

సోమవారం 18 నవంబర్ 2024

I

అల్లూరి సీతారామరాజు

ఆకట్టుకుంటున్న వలిసె పూలు

ప్రజాశక్తి - చింతపల్లి :- మన్య ప్రాంతంలో విస్తారంగా సాగయ్యే వలిసె చేలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శీతల వాతావరణానికి తోడు వలిసె చేలలో విరబూసిన పసుపు వర్ణ శోభితమైన వలిసె పూలు పర్యాటక ప్రియులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీకెండ్ లో శని, ఆదివారాలలో ఆంధ్ర కశ్మీర్ గా పేరొందిన లంబసింగి, తాజంగి, చెరువుల వేనం వ్యూ పాయింట్ తదితర ప్రదేశాలతో పాటు తాజంగి జలాశయం వద్ద ఏర్పాటు చేసిన జిప్ లైన్, బోట్ షికార్, దట్టంగా పరుచుకునే మంచు పరదా, మన్యంలో విస్తారంగా సాగయ్యే కాఫీ పూల పరిమళాలు, వలిసె పూల అందాలు పర్యాటకులను మైమరిపింప చేస్తున్నాయి. వలిసె చేలలో ఫోటోలు తీసుకునేందుకు పర్యాటకులు పోటీపడుతున్నారు.

వలిసె పూల మధ్య యువతి సందడి

మూడేళ్ల నుంచి..అసంపూర్తిగానే వంతెన

- రవాణాకు ఇబ్బంది పడుతున్న గిరిజనులు, పర్యాటకులు

అసంపూర్తిగా నిలిచిన వంతెన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: అరకు వారపుసంత నుంచి కొల్లాపుట్టు రోడ్డుకు ప్రధాన వంతెన కొర్రాయి గత్తర జిల్లెడ గెడ్డ వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పునాది దశలోనే వదిలేయడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ రోడ్డుకు ఆనుకొని కొర్రాయి, కొల్లాపుట్టు, పంచాయతీ గ్రామాలతో పాటు అంతర్ రాష్ట్రం ఒడిస్సాకు రోడ్డు కనెక్ట్ అయి ఉంది. ఈ గ్రామాల గిరిజనులకు ఎటువంటి నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలన్నా, వైద్య సేవలు పొందాలన్నా , పండించిన కూరగాయలను విక్రయించాలన్న వారపు సంత అరకు సంత బయలుతోపాటు అరకులోయ ప్రాంతానికి వచ్చి వెళ తుంటారు. ఈ ప్రాంత గిరిజనుల రవాణా సౌకర్యానికి గత్తర జిల్లెడ వంతెన ప్రధానంగా ఉంది. ఈ వంతెన నిర్మాణానికి సుమారు మూడేళ్ల క్రితం నిర్మాణ పనులను ప్రారంభించి, రాడ్లతో పునాది దశ వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు.

అప్పటినుంచి ఇప్పటివరకు సుమారు మూడేళ్ళ గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైన వర్షం నీరు నిల్వ ఉండి పోతుండడంతో పాటు బురదగా మారుతుంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండ డంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఆ ప్రాంతం గిరిజనులు అనారోగ్యానికి గురైన వెంటనే 108 అంబులెన్స్ వెళ్లలేని దుస్థితి ఉంది. ఒడిస్సాకు కనెక్టివిటీగా ఈ రోడ్డ ఉండటంతో నిత్యం ఒడిస్సా నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు.

ఇబ్బంది పడుతున్న పర్యాటకులు:

కొల్లాపుట్టులో జల తరంగిని పర్యాటక ప్రదేశం ఉండడంతో పర్యాటకులు కూడా నిత్యం అక్కడ రాకపోకలు చేస్తుంటారు. అక్కడ వెళ్లేందుకు కూడా ఈ వంతెన మీదుగా వెళ్లాల్సి ఉండటంతో పర్యాటకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రదేశాన్ని తిలకించడానికి వెళ్తూ కొంతమంది ఆ వంతెన వరకు వెళ్లి తిరుగు ముఖం పడుతున్నారు. పలుమార్లు ఆ ప్రాంత గిరిజనులు సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మత్తు పనులు

వంతెన వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్న గిరిజనులు

కొర్రాయి రోడ్డు గత్తరజిల్లేడ వంతెన అసంపూర్తిగా ఉండగా, పక్కన ప్రత్యామ్నాయంగా ఉన్న రోడ్డుపై మట్టి పేరుకు పోయి గోతులు ఏర్పడి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొల్లపుట్టు జలతరంగినిలో పనిచేస్తున్న పర్యాటక సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు కదిలి గోతులు గోతులుగా ఉన్న రోడ్డును లెవెల్ చేసి రోడ్డు మరమ్మత్తు చేశారు.. ఎన్నిసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో విసుగు చెంది స్వచ్ఛందంగా మరమ్మత్తు చేసుకున్నామని జలతరంగిణి సిబ్బంది చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి యుటిఎఫ్ ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంఇఒ, యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- మారేడుమిల్లి : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై శనివారం మృతి చెందిన ఉపాధ్యాయుడు గంగవరం గ్రామానికి చెందిన వీరవత్తుల ప్రతాప్ కుటుంబానికి యుటిఎఫ్ ఆర్థికసాయాన్ని అందజేసింది. రంపచోడవరం మండలం గొట్లగూడెం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఈనెల 13న బూరుగుపూడి వద్ద ప్రమాదానికి గురైన ప్రతాప్, రాజమండ్రి బొల్లినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతిచెందిన ప్రతాప్ గతంలో మారేడుమిల్లి మండలంలోనూ ఉపాధ్యాయునిగా పనిచేశారు. ప్రతాప్ మృతిచెందిన విషయం తెలుసుకున్న మారేడుమిల్లి మండల యుటిఎఫ్ సభ్యులు ఆదివారం గొట్లగూడెంలోపాయన ఇంటికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు. ప్రతాప్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ తరపున ప్రతాప్ కుటుంబ సభ్యులకు రూ.40వేలు ఆర్థికసాయాన్ని ఎంఇఒ వై మల్లేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు వై విల్సన్ బాబు, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, కె.ఆంధ్రయ, సహాధ్యక్షులు ఎం సాయిబాబా, వి అబ్బాస్, సాల్మన్ రాజు, ఐటిడిఎ సబ్ కమిటీ కోకన్వీనర్ కె.సూరిబాబు, రంపచోడవరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ సనాతనబాబు, ఎన్ వెంగళరావు పాల్గొన్నారు.

రోడ్డు అంచుల్లో పేరుకుపోయిన తుప్పలను తొలగించరూ.?

ప్రజాశక్తి- దేవీపట్నం : మండలంలోని పోతవరం గ్రామం నుంచి పోచమ్మ దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి రోడ్డు ప్రమాదాలు నివారించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్, ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. ఈమేరకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారితోపాటు, పోచమ్మ ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులు మలుపులు వద్ద ఎదురుగా వచ్చేవాహనాలు కనిపించక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉంది. ఇక్కడ నెలకొన్న ప్రమాదకర పరిస్థితులపై తక్షణం దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యలగాడ నాగేశ్వరావు, కారం రామన్న దొర, కుండ్ల సాయిరామ్ రెడ్డి, నడిపూడి గణపతి రెడ్డి ఉన్నారు.

బోధనలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

లోతుగెడ్డలో పాఠశాలను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి బాలయ్య

ప్రజాశక్తి - చింతపల్లి : విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలోని లోతుగెడ్డ జంక్షన్‌లోనీ ప్రభుత్వ పాఠశాలను పెద బరడ సర్పంచ్ సమిడ గోపాల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తే పై తరగతుల్లో మంచిగా రాణిస్తారని, అప్పుడే వారి భవిష్యత్‌కు మంచి బాటలు వేసిన వారవుతారన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలని కోరారు. విధ్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని అందించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఉల్లి లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపిపి బూసరి కృష్ణారావు పాల్గొన్నారు.

బొర్రా గుహల వద్ద పార్కింగ్ స్థలం కేటాయించాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల వద్ద వాహనాల పార్కింగ్ స్థలం తక్షణమే ప్రభుత్వం కేటాయించాలని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం అక్కడకు సందర్శించిన ఆయన స్థానికులు, పర్యాటకుల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బొర్రా గుహలు తిలకించేందుకు విదేశీ తర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది పర్యాటకులు సందర్శిస్తున్నారని తెలిపారు. వాహనాలు నిలిపేందుకు సరైన పార్కింగ్ స్థలం లేక మెయిన్ రోడ్డు వద్ద నిలిపి వేస్తుండటంతో రాకపోకలు సాగించే వాహనాలు తిరుగు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, గేటువలస వద్ద ఉన్న పార్కింగ్ స్థలాన్ని పరిశుభ్రపరచాలని, గుహా సమీపంలో విస్తరంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏటా కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వానికి లాభం వస్తున్నప్పటికీ అభివృద్ధి చేయడంలో ఎందుకు వెనకంజ వేస్తుందని ప్రశ్నించారు. గుహల లోపల అవసరమైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి .దేవన్న, తదితరులు పాల్గొన్నారు

పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

మదిని దోచే మన్యం సోయగాలు!



సీలేరు నది ఒడ్డున పచ్చని కొండల్లో పాల నురగ మంచు మేఘాలు

ప్రజాశక్తి -సీలేరు: మన్యంలో సహజసిద్ధమైన ప్రకృతి సోయగాలు సందర్శకులు, ప్రకృతి ప్రేమికుల మనసును దోచుకుంటున్నాయి. ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయ వేళ బంగారువర్ణంలో మెరిసేలా ఉన్న సీలేరు నదిజలాలు, పరివాహక ప్రాంతంలో ఆకుపచ్చని చెట్లు, వాటి మధ్యనే పాలు నురగలను తలపించే మంచుమేఘాలు ఆవిష్కృతం కావడంతో పలువురిని మంత్రముగ్ధులను చేశాయి. సీలేరు పరిసర ప్రాంతాల్లో ప్రకృతి రమణీయమైన దృశ్యాలు క్షణానికో విధంగా ఆవిష్కృతమౌతూ, ప్రకృతి ప్రేమికులకు మధురానుభూతిని కలిగిస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఆదివారం సాయంత్రం ఆవిష్కృతమైన ఈ మధుర దృశ్యాలను నిత్యం తిలకించే స్థానికులతోపాటు పర్యాటకులను సైతం మంత్రముగ్ధులయ్యారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలో కనిపించే ఈ కలర్‌ఫుల్ అందాలను ఆ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులతోపాటు పాదచారులు, ఇక్కడే నివసించే ఎపి జెన్‌కో ఉద్యోగుల కుటుంబాలతోపాటు, పర్యాటకులు ప్రకృతి సింగారించుకున్న ఈ సుందర దృశ్యాలను చూసి ఎంతో మధురానుభూతిని పొందారు.

సీలేరు మెయిన్ డ్యాం వెనుక భాగంలో ఆవిష్కృతమైన ప్రకృతి రమణీయ దృశ్యం

హెచ్‌ఎం, వార్డెన్‌లపై చర్యలేవీ : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-పాడేరు: హుకుంపేట మండలంలోని మెరికచింత ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో బియ్యం అక్రమ రవాణా పై హెచ్‌ఎం, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొర్రా కార్తీక్ శ్రీను, పాంగి జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే వార్డెన్ ఇష్టారాజ్యాంగా కొనసాగుతున్నారన్నారు. వార్డెన్, హెచ్‌ఎం పైన శాఖ పర్యమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.సమగ్ర విచారణ చేసి బాధ్యులపై శాఖ పరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు స్పందించిన అధికారులు వాటికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని కోరారు.డిప్యూటేషన్ వార్డెన్ల వ్యవస్థను రద్దు చేసి పూర్తి కాల వార్డెన్లను నియమించాలన్నారు. ఇటువంటి ఘటనలు మళ్ళీ పునరావతం కాకుండా చూడాలని, లేనిపక్షంలో భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న నాయకులు

సారా, బెల్టు దుకాణాలను నియంత్రిస్తాం

-ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కూర్మారావు

ప్రజాశక్తి -చింతపల్లి :-మన్యంలో నాటు సారా, మద్యం గొలుసు దుకాణాలను నియంత్రిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె కూర్మారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో ఎక్కడైనా మద్యం గొలుసు దుకాణాలు, నాటు సారా, నల్ల బెల్లం, అమోనియా క్రయ విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారంలోనే తమ సిబ్బందితో రైడ్ చేసి రెండు మద్యం గొలుసు దుకాణాలలో 56 మద్య సీసాలు పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు., నాటు సారాకి ఉపయోగించే నల్లబెల్లపు పులుపు 1600 లీటర్లు ధ్వంసం చేశామని తెలిపారు.గొలుసు దుకాణాలకు లైసెన్స్ దుకాణదారులు మద్యం సీసాలు సరఫరా చేస్తే మొదటిసారిగా ఐదు లక్షల రూపాయలు జరిమానా విధించి, మరోసారి దొరికితే లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు.మద్యం సీసాలు ఎమ్మార్పీ ధరకే అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చిన్న, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

గిరిజనులకు డోలీ కష్టాలు

ప్రజాశక్తి- అనంతగిరి:గుమ్మ పంచాయతీ పరిది కరిగొడ గ్రామ గిరిజనులకు డోలీ కష్టాలు తప్పలేదు. గ్రామంలో బోయిన సన్యాసమ్మ వాంతులు, విరోచనాలుతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సబ్యులు 8. కిలో మీటర్ల దూరం నిమ్మ ఊట గ్రామంలో చేర్చి అక్కడ నుండి ప్రవేటు వాహనంలో ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పాపికొండల విహారయాత్రకు

పోటెత్తిన పర్యాటకులు

- పది బోట్లలో వెళ్లిన 690 మంది సందర్శకులు
- సూచనలు చేసిన ఎస్‌ఐ షరీఫ్

పాపికొండల యాత్రకు సిద్ధంగా ఉన్న బోట్లు

ప్రజాశక్తి-దేవీపట్నం :పాపికొండల విహారయాత్రకు ఆదివారం భారీగా పర్యాటకులు వెళ్లారు.. ఆదివారం గోదావరి నదిలో పర్యాటక బోట్లు సందడి చేశాయి. ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో బోట్లు పరిశీలన చేయడంతో పాటు, పర్యాటకులకు సూచనలు ఇచ్చారు. దేవీపట్నం నుంచి పాపికొండల విహారయాత్రకు. పది పర్యాటక బోట్లలో 690 మంది పర్యాటకులు వెళ్ళగా, పర్యాటకులతో గోదావరి నదిలో విహారయాత్ర సందడిగా సాగింది. ఉదయం 9 గంటలకు బయలు దేరిన పర్యాటక బోట్లు గోదావరి నది చుట్టుపక్కల ఉన్న ప్రకృతి అందాలను తిలకిస్తూ, మధ్యాహ్నం సమయానికి పాపి కొండలకు చేరుకున్నారు. అక్కడ పేరంటాలపల్లి వద్ద శివాలయాన్ని దర్శించుకుని, పర్యాటక ప్రాంతాలను తిలకించి తిరిగి ప్రయాణమయ్యారు. సాయంత్రం ఐదు గంటలకు గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న బోట్ పాయింట్ వద్దకు చేరుకున్నారు. విహారయాత్రకు వెళ్లే పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు అందరికీ లైఫ్ జాకెట్లు వేయించామని టూరిజం శాఖ అధికారులు తెలిపారు. పర్యాటకులందరూ లైఫ్ జాకెట్లు వేసుకున్న తరువాతే బోట్లు గోదావరి నదిలో ముందుకు కదిలాయి. పాపికొండల విహారయాత్రలో గోదావరి తీరంలో పర్యాటక సందడి నెలకొంది.

పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

సత్ఫలితాలనిస్తోన్న 'పరివర్తన'!

- గంజాయికి స్వస్తి పలికి, సంప్రదాయ పంటలపై గిరిజనం దృష్టి
- గణనీయంగా పెరిగిన కూరగాయల సాగు, దిగుబడులు
- ధర గిట్టుబాటు కాక, కొనుగోళ్లు లేక మన్యం రైతుల ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు: పోలీసులు నిర్వహించిన పరివర్తన కార్యక్రమం మన్యంలో సత్ఫలితాలనిస్తున్నట్లు కనిపిస్తోంది. గిరిజనులు గంజాయి పంటలకు స్వస్తి పలికి, సాంప్రదాయ పంటలపై దృష్టి సారించారు. ఫలితంగా కూరగాయలు, ఇతర దినుసుల పంటల సాగువైపు ఆసక్తి చూపడంతో వాటి దిగుబడి గణనీయంగా పెరిగింది. అయితే అదే సమయంలో ఆయా పంటలకు ధరలేక, మార్కెటింగ్ సదుపాయం కానరాక గిట్టుబాటు కాకపోవడంతో గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వపరంగా తమకు ప్రోత్సాహాన్నిచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

మన్యంలోని పలు ప్రాంతాల్లో కూరగాయల పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినట్లు కనిపిస్తోంది. సీలేరు వారపు సంతకు వచ్చిన కూరగాయలు, ఆకుకూరలు ఇందుకు నిదర్శనమని స్థానికులు అంటున్నారు. అల్లూరి జిల్లాలోని చింతపల్లి మండలం చౌడుపల్లి, జికె.వీధి మండలం దుప్పిలివాడ పరిసర గ్రామాల్లో అధికశాతం కూరగాయల సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో దిగుబడి కూడా ఆశాజనకంగా ఉందని రైతులు అంటున్నారు. మన్యవాసులు పండించిన కూరగాయలను చింతపల్లి, జికె.వీధి, సప్పర్ల, దారకొండ, సీలేరు వారపు సంతలకు తీసుకువెళ్లి విక్రయాలు జరిపి, జీవనోపాధి పొందుతున్నారు ఆదివారం సీలేరు వారపు సంతకు బరబాటి, బీన్స్, చిక్కుళ్ళు, కంద, కాలీఫ్లవర్, క్యాబేజీ, బెండ. ఆనపకాయలు. గోంగూర, తోటకూర, చుక్కకూర, కొత్తిమీర, ముల్లంగి వంటి ఆకుకూరలను గిరిజనులు విరివిగా తీసుకువచ్చి విక్రయాలు జరిపారు. రెండు మూడు నెలలుగా వారపుసంతకు అంతంతమాత్రంగా వచ్చిన కూరగాయలు, ఈ వారం అధికంగానే తెచ్చారు. మైదానప్రాంత వ్యాపారులు తెచ్చేటప్పుడు ధర అధికంగా ఉన్న కూరగాయలను, ఇపుడు వాటిని పండించిన గిరిజన రైతులే నేరుగా సంతకు తేవడంతో ధరకాస్తా దిగొచ్చి సామాన్యులు, దినసరి కూలీలకు అందుబాటులో వచ్చాయి. దీంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. అంతవరకు బాగానే ఉన్నా, ఇపుడు కూరగాయాలను పండించిన గిరిజన రైతులకు ధర తగ్గడంతో గిట్టుబాటు కాకపోవడం, మరోవైపు విరివిగా కూరగాయలు రావడంతో అవి అమ్ముడుకాక రైతులు ఒకింత నిరాశకు గురయ్యారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సాహించిన ప్రభుత్వం, వాటిని పండించిన గిరిజన రైతులకు గిట్టుబాటు అయ్యేలా మార్కెటింగ్, ఇతర సౌకర్యాలను కల్పించాలని వారు కోరుతున్నారు.

సీలేరు వారపుసంతలో గిరిజన రైతులు అమ్మకానికి తెచ్చిన కూరగాయలు

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రంథాలయ వారోత్సవాల భాగంగా స్థానిక గ్రంథాలయంలో నాలుగో రోజు ఆదివారం విద్యార్థినులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కేజీబీవీ, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల నుంచి సుమారు వంద మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. చదువుతోపాటు డ్రాయింగ్‌లో కూడా విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని గ్రంథాలయ అధికారిని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది కే.సుబ్బారావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని కోరుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు సీతంపేటలోని ఆయన నివాసంలో జర్నలిస్టుల యూనియన్ నాయకులు కలిసి సమస్యలపై చర్చించారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా అసెంబ్లీలో వారి సమస్యలను చర్చించి ప్రత్యేక నిధులు కేటాయించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జనసేన జిల్లా అధ్యక్షుడు విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేసి డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం జర్నలిస్టులకు 4 సెంట్లు ఇళ్ల స్థలాలు ఉచితంగా కేటాయించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైర్డ్ జర్నలిస్టులకు రూ.10వేల పెన్షన్ సదుపాయం, కోవిడ్‌తో చనిపోయిన జర్నలిస్టులకు రూ.5లక్షల పరిహారం, ప్రెస్ అక్రిడిటేషన్ల పెంపు, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీల ఏర్పాటు, ప్రమాద బీమా పునరుద్ధరణ, స్థానిక పత్రికలకు చేయూత తదితర సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు నగరంలో అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఫోన్‌లో మాట్లాడి వినతిపత్రాన్ని పంపారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఎపియుడబ్ల్యుజె గాజువాక యూనిట్ అధ్యక్షుడు కొయిలాడ పరశురాం, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎం.కీర్తన్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందుయాదవ్, ఎపిజెయు జిల్లా కార్యదర్శి ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నివాళ్లర్పిస్తున్న టిడిపి దేవీపట్నం మండల నాయకులు

రామ్మూర్తినాయుడుకు ఘననివాళి

ప్రజాశక్తి - దేవీపట్నం : ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు అకాల మరణానికి మండల టిడిపి నేతలు సంతాపం ప్రకటించారు. టిడిపి మండల అధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు (బుజ్జిబాబు) ఆధ్వర్యంలో తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాగాపు బాబూరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి చవళం శివరామకృష్ణ, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చవళం బాపురాజు, బిసి సెల్ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ముచ్చు నాగేశ్వరరావు, నియోజవర్గ మీడియా కోఆర్డినేటర్ కేశవరపు చంద్రకుమార్, తుర్రం సుబ్బారావు, కంకిపాటి చక్ర రావు, గనిశెట్టి వీరబాబు, పాతాళ పండు, దబ్బా నాని తదితరులు రామ్మూర్తినాయుడుకు నివాళులర్పించారు.

కొయ్యూరు : సిఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతికి మండల టిడిపి నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు ఆధ్వర్యంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి కునిశెట్టి చంద్రరావు, మేడిబోయిన సత్తి బాబు, వాసం రాంబాబు, పాడి వెంకటేశ్వర్లు, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

కొయ్యూరులో టిడిపి నేతల నివాళి

చింతపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మండలం కార్యనిర్వాహక కార్యదర్శి ఆంద్రాబు లక్ష్మణ్, బూత్ ఇంచార్జ్ కేశవ, గొందిపాకలు యూనిట్ ఇంచార్జ్ యస్వంత్ లతో కలిసి గొందిపాకల గ్రామంలో ఆదివారం రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం ప్రకటించారు.

చింతపల్లిలో నివాళ్లర్పిస్తున్న టిడిపి మండల నాయకులు

జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆదివాసీలకు ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖపట్నం జిల్లా సర్వసభ్య సమావేశం డిమాండ్ చేసింది. దీంతో పాటు 1/70 చట్టాన్ని, పెసా చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని, అటవీ హక్కుల సంరక్షణ చట్టాన్ని కొనసాగించాలని, పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని తీర్మానించింది. సంఘం విశాఖపట్నం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం ఎంవిపి కాలనీ డబుల్ రోడ్డులోని గిరిజన భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు వి.తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ హాజరయ్యారు. గత కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం గతంలో నాయకత్వం వహించిన నాయకులకు సన్మానాలు నిర్వహించారు. ప్రస్తుత కార్యదర్శి రూడా సత్యారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కోశాధికారి కిముడు జానకిరాజు ఆదాయ వ్యయాల నివేదికలు సమర్పించారు. సమావేశంలో సంఘం విశాఖపట్నం అధ్యక్షులు అంబిడి కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు డిప్పల సాంబమూర్తి, ఉపాధ్యక్షులు కిముడు సూర్యనారాయణ, కార్యాలయ కార్యదర్శి సరమండ గీత, సహాయ కార్యదర్శి సూకూరు వీరన్న దొర, భవన్ కార్యవర్గ చైర్మన్ జన్ని రామన్న, కోశాధికారి పాంగి జగన్నాథం పాల్గొన్నారు.

విశాఖలో లక్ష్మీ హ్యుందాయ్ సర్వీస్ క్యాంపులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ లక్ష్మీ హ్యుందాయ్ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులోని వైఎంసిఎ ప్రాంగణంలోనూ, అగనంపూడి వద్ద హ్యుందాయ్ ఆల్వేస్ అరౌండ్ పేరుతో సర్వీస్ క్యాంపులు నిర్వహించారు. ఈ క్యాంపులను జిఎస్‌టి రాష్ట్ర అదనపు కమిషనర్ ఎస్.శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ హ్యుందాయ్ గ్రూప్ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆల్వేస్ అరౌండ్ ప్రోగ్రామ్‌ను దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని అవుట్ లెట్లలో ఆదివారం నిర్వహించినట్లు తెలిపారు. సర్వీస్, స్పేర్స్‌పై మంచి డిస్కౌంట్స్‌తో పాటు సేల్స్ అండ్ ఎక్చేంజి విభాగంలో ఆఫర్స్‌ను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ ఎజిఎం ఎమ్‌డి.ప్రసాద్, అకౌంట్స్ జిఎం జి.కిషోర్ కుమార్, సేల్స్, సర్వీస్, స్పేర్స్, ఎక్చేంజ్, యాక్సెసరీస్ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బొండం కొత్తవలస రోడ్డుకు మోక్షం ఎప్పుడో

- రోడ్డు పనులు పూర్తి చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

నినాదాలు చేస్తున్న నేతలు, గ్రామస్తులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని బొండం పంచాయతీ బొండం కొత్త వలస రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు అన్నారు. ఆదివారం బొండం కొత్తవలస రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేసి చుట్టూ పక్కల గిరిజనులకు రవాణ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఈ సంధర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు మాట్లాడుతూ, 2019 సంవత్సరంలో కిలోమీటర్ వరకు బీటి రోడ్డు గతంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిందని, ఓ కంపెనీ రోడ్డు పనులు చేయడానికి టెండర్ తీసుకొని గతంలో మట్టి, గ్రావెల్ పనులు పూర్తి చేయలేదన్నారు. ఐదేళ్లు పూర్తికావస్తున్నా రోడ్డు పనులు నేటికీ పూర్తి చేయకుండా అసంపూర్తిగ నిలిపి వేశారని దీంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేక సార్లు పాడేరు స్పందన కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. వివిధ కారణాల పేరు చెప్పి గుత్తేదారులు తప్పించుకుంటున్నారని చెప్పారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మొత్తం గుంతలుగ ఏర్పడి మోటర్ బైక్ లు కూడా నడవలేని విదంగా తయారైందన్నారు. గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం పాలైతే రోగులకు అత్యవసర చికిత్స అందించేందుకు అంబులెన్సు రాలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం పంచాయతీ నాయకులు టీ జోషి, జి సత్యారావు ,జి రామన్న, కృష్ణ, దేవరాజు, గ్రామస్తులు రామ్మూర్తి, కన్నమ్మ ,కామేష్, నిలమ్మ, చిన్నమ్మి ,తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి కార్యాచరణ

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు, అరకు, డుంబ్రిగూడ ప్రాంతాల్లో ఉన్న పర్యాటక కేంద్రాలు మరింత ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటున్నాయి. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిమాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతంతో పాటు అరకు మండలంలోని పద్మాపురం గార్డెన్స్ డుంబ్రిగూడ మండలంలోని చాపరాయి జలపాతంకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. వారాంతపు సెలవుల్లో ఈ మూడు పర్యాటక కేంద్రాలకు అనేక ప్రాంతాల నుంచి వేలాదిమంది పర్యాటకులు తరలి వస్తున్నారు. . ఈ మేరకు ఈ మూడు పర్యాటక కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఐటీడీఏ కార్యాచరణ చేపట్టింది. పర్యాటకులకు అవసరమైన అదనపు సౌకర్యాలతో పాటు ఆకర్షణీయమైన హంగులతో శోభాయమానంగా వీటిని తీర్చిదిద్దుతున్నారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునే రీతిలో వీటిని రూపొందిస్తున్నారు.

కొత్తపల్లి జలపాతం రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో కొత్త అందాలను విరజిమ్ముతోంది. ఈ కొత్తపల్లి జలపాతం వద్ద అమరుస్తున్న వింటేజ్ కలర్ లైట్స్, రంగురంగుల కాంతు లీనుతూ జల ప్రవాహానికి మరింత శోభ చేకూరుస్తున్నాయి. అలాగే జలపాతం వద్ద రాళ్లపై వేస్తున్న కలర్ పెయింటింగ్స్‌తో పాటు పార్క్ బ్యూటిఫికేషన్ ఎంట్రన్స్ ఆర్చ్ వ్యూ పాయింట్ తదితర ఆకృతులన్నీ పర్యాటకులకు అదనపు ఆకర్షణలుగా అలరించనున్నాయి. చింతపల్లి మండలంలోని లంబసింగి తోపాటు అరుకు పాడేరు వంజంగి హిల్స్ పర్యటనకు వచ్చే పర్యాటకులకు ఈ కొత్తపల్లి జలపాతం వీక్షించేందుకు ప్రధాన రహదారికి చేరువుగా ఉంది.

రూ.2 కోట్లతో అభివృద్ధి : ఐటిడిఎ పిఒ అభిషేక్

ఈ మూడు పర్యాటక కేంద్రాలను సుమారు రెండు కోట్లు వ్యయంతో మరింత అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ వెల్లడించారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ, ఈ పర్యాటక కేంద్రాల్లో ఏడాదికి సుమారు మూడు లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారని తెలిపారు. పర్యాటకుల్ని మరింత ఆకర్షించే రీతిలో వీటిని అభివృద్ధి పరుస్తున్నామని చెప్పారు. కొత్తపల్లి జలపాతం వద్ద 50 లక్షల వ్యయంతో ఫుట్ పాత్ టైల్స్, ఎలక్ట్రిఫికేషన్, వ్యూ పాయింట్, ఎంట్రన్స్ ఆర్చ్, టికెట్ కౌంటర్, పార్క్ బ్యూటిఫికేషన్, వాల్ కలర్ పెయింటింగ్స్ వింటేజ్ కలర్ లైట్స్ తదితర అదనపు ఆకర్షణలను రూపొందిస్తున్నామని తెలిపారు అరకు లోయ లోని పద్మపురం గార్డెన్స్ లో 50 లక్షల వ్యయంతో చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్ న్యూ ఎంట్రన్స్ ఆర్చ్ టికెట్ కౌంటర్స్ గార్డెన్ బ్యూటిఫికేషన్, లైటింగ్ పార్క్, ఫౌంటైన్స్, సెల్ఫీ పాయింట్, మ్యాప్ పాయింట్, గ్లో యానిమల్స్ పిక్చర్స్ తోపాటు మరో 50 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఇంటర్నల్ రోడ్స్ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 70 లక్షల వ్యయంతో డుంబిరిగూడ మండలం చాపరాయి జలపాతం వద్ద ఎంట్రెన్స్ గేట్ పార్క్ దింసా స్టేజ్ టాయిలెట్స్ సిమెంట్ బెంచీలు రక్షణ గోడలు డ్రెస్సింగ్ రూమ్స్ లైటింగ్ ఫుట్ పాత్ క్యాస్కెట్ టైటిల్స్ తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మూడు పర్యాటక కేంద్రాలు రానున్న రోజుల్లో పర్యాటకుల్ని మరింత ఆకట్టుకోనున్నాయని పర్యాటకులు మళ్లీమళ్లీ సందర్శించే రీతిలో వీటిని ఆహ్లాదాన్ని ఆనందాన్ని పంచేరీతిలో వీటిని రూపొందిస్తున్నామని చెప్పారు.

2705 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో ఉన్న బాలాజీ మోడరన్ రైస్ మిల్‌లో జిల్లా సివిల్ సప్లై అధికారి వి.భాస్కరరావు ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహించారు. మిల్లులో అనధికారికంగా నిల్వ ఉంచిన పిడిఎస్ ఫోర్టిఫైడ్ బియ్యం 61 ప్లాస్టిక్ బ్యాగులను అధికారులు గుర్తించారు. 2705 కిలోల పిడిఎఫ్ రైస్‌ను స్వాధీనం చేసుకొని మిల్లు యజమానిపై 6-ఎ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో సివిల్ సప్లై అసిస్టెంట్ అధికారి కల్యాణి, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నగర వనం, పర్యాటకానికి ప్రాధాన్యత

- రూ.60 లక్షలతో నర్సరీల అభివృద్ధి
- 'ప్రజాశక్తి'తో విశాఖపట్నం సర్కిల్ అటవీ సంరక్షణాధికారి బిఎం.దివాన్ మైదీన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరవనం, టూరిజానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు విశాఖపట్నం సర్కిల్ అటవీ సంరక్షణాధికారి బిఎం దివాన్ మైదీన్ వెల్లడించారు. వృక్షజాల పరిరక్షణను సులభతరం చేయడం, కాలుష్యాన్ని తగ్గించి.. స్వచ్ఛమైన గాలిని అందించడం, వన్యప్రాణుల కోసం విశాఖ కంబాలకొండ ప్రాంగణంలో ఇప్పటికే ఎకో టూరిజం పార్క్ ఉన్నందున నగరవనం పథకాన్ని అటవీశాఖ ఆధ్వర్యాన మరింత విస్తృతం చేయనున్నట్టు తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

నగర వనం లక్ష్యమేంటి ?

ప్రతి మున్సిపాల్టీ పరిధిలోనూ అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్ మార్గం, వినోద ప్రదేశం అందించడం కేంద్ర ప్రభుత్వ నగర వనం ప్రాజెక్టు లక్ష్యం. కొత్తగా ఫారెస్ట్ ఏరియాల్లో నర్సరీల అభివృద్ధికి భూమిని గుర్తించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. నగర వనం అంటే ప్రతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల కోసం కొంత స్థలాన్ని అభివృద్ధి చేయడం. దీనిని ఎపి డిజాస్టర్ రిలీఫ్ ప్రాజెక్టు (ఎపిడిఆర్‌పి) అంటారు. ప్రకృతి మధ్య నడవడం ఇతర వాటితో పోల్చితే భిన్నమైన అనుభూతిని ఇస్తుంది. నగరానికి ఇలాంటి పార్కుల అవసరం ఎంతైనా ఉంది.

నగరవనం ఎలా అమలు చేస్తారు ?

కంబాలకొండలో ఇప్పటికే పూర్తిచేశాం. ఎకో టూరిజానికి తగ్గట్టుగా కంబాలకొండను చాలా వరకూ తీర్చిదిద్దాం. నగర వనం భావనకు అటవీ శాఖ కార్యరూపం ఇచ్చే ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇది 17 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కంబాల కొండ వన్యప్రాణుల అభయారణ్యంలో 450 ఎకరాలకుపైగా అటవీ శాఖ ఎకో టూరిజం పార్క్, సెంట్రల్ నర్సరీ, స్మృతివనం, యానిమల్ రెస్క్యూ సెంటర్ (ఎఆర్‌సి) నిర్వహిస్తోంది. టూరిస్టులు, ప్రజలను కంబాలకొండ ప్రదేశం సరికొత్త సహజసిద్ధమైన హంగులతో ఆకట్టుకుంటోంది.

నగరవనాలను ఎక్కడెక్కడ అభివృద్ధి చేశారు ?

విశాఖలో కంబాల కొండలో అభివృద్ధి చేశాం, అనకాపల్లి జిల్లాలో బయ్యవరం, విజయనగరం జిల్లాలో సారిపల్లి, బేతనపల్లి, వెలగాడ, శ్రీకాకుళం జిల్లాలో కాశీబుగ్గల్లో అభివృద్ధి చేశాం. ఉమ్మడి విశాఖలోగల యలమంచిలి, నర్సీపట్నం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. తాటిపూడిని బాగా అభివృద్ధి చేయాల్సి ఉంది.

లంబసింగి, అనంతగిరిలోనూ టూరిజం అభివృద్ధికి అశేష కృషి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశాం. 60 లక్షల నర్సరీలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎన్ఆర్ఇజిఎస్) అమలులో భాగంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. వాటితో ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు అటవీశాఖ కృషి చేపట్టింది. ప్రతి మున్సిపాల్టీలోనూ నగరవనం కింద రూ.2 కోట్లును నగర వనం కింద ఖర్చుచేయనున్నాం. అయితే, జిల్లాల కలెక్టర్లు ఇంకా కొంతమంది నగర వన పనులకు అడ్మినిస్ట్రేటివ్ ఆమోదం ఇవ్వాల్సి ఉంది. అనకాపల్లి జిల్లా పరిధిలోని యలమంచిలి, నర్సీపట్నం ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద నర్సరీల అభివృద్ధికి ప్రతిపాదనలను కేంద్రానికి పంపాం.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ గుమ్మడి కనకరాజు (50) ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. తెల్లవారుజామున వ్యాయామం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే ఆయన కన్నుమూశారు. పోలీస్ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఎసిపిలు రాఘవేంద్రరావు, సీతారాం పాల్గొన్నారు. 1995లో విధుల్లో చేరిన కనకరాజు 29 ఏళ్ల పాటు పలువురు ప్రముఖులకు పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌గాను, పోలీసు జిమ్ ట్రైనర్‌గాను, క్యూఆర్‌టి టీం సభ్యునిగానూ అనేక విభాగాల్లో సేవలందించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు, భార్య ఉన్నారు. కనకరాజు మృతి విషయం తెలుసుకున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎసిపి అన్నెపు నరసింహమూర్తి హుటాహుటిన వచ్చి పార్థివ దేహం వద్ద నివాళ్లర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. కుమారుడికి వీలైనంత త్వరగా పోలీస్ విభాగంలో ఉద్యోగం ఇస్తామని, అదేవిధంగా ఆడపిల్లల చదువు నిరాటంకంగా కొనసాగేందుకు కావలసిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కుటుంబానికి రావలసిన బెనిఫిట్స్ అందజేస్తామన్నారు. దీనికి సంబంధించిన పనులు వేగవంతం చేస్తామన్నారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పాలకుల తీరుతో రానురాను విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ విసి కెఎస్.చలం అన్నారు. ఎఐఎస్ఎఫ్ 32వ జిల్లా మహాసభలు ఆదివారం ఆంధ్ర యూనివర్సిటీ టిఎల్ఎన్ సభా హాల్‌లో జరిగాయి. తొలుత యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సంఘం మాజీ నాయకులు డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కారక్రమంలో చలం మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం పెరుగుతోందన్నారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

బీచ్ రోడ్డులో వాక్‌థాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డేను పురస్కరించుకుని విశాఖపట్నంలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని కాళీ మాతా టెంపుల్ నుంచి వైఎంసిఎ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. వైజాగ్‌లోని రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్, నియోనాటాలజిస్ట్ అండ్ పీడియాట్రిషియన్ డాక్టర్ బాల శ్రీలత ఈ వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలలు నిండక ముందే పుట్టిన శిశువులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రత్యేక సంరక్షణను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్, పీడియాట్రిషియన్ డాక్టర్ ఫణి ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

జూ, కంబాలకొండలో వన భోజనాల సందడి

ప్రజాశక్తి - ఆరిలోవ : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, కంబాలకొండ వన భోజనాలతో సందడిగా మారాయి. కార్తీకమాసం రెండో ఆదివారం కావడంతో కుటుంబాలు, స్నేహితులు, ఉద్యోగ సంఘాలు, కాలనీ సంఘాలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున రావడంతో పార్కులు కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

జూకు రూ.7.64 లక్షల ఆదాయం

ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలను రికార్డు స్థాయిలో సందర్శకులు ఆదివారం సందర్శించారు. 10వేల మంది సందర్శించడం ద్వారా రూ.7.64 లక్షల ఆదాయం సమకూరింది. కంబాలకొండకు సందర్శకుల ద్వారా సుమారు రూ.65వేలు ఆదాయం సమకూరింది.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులకు డాక్టర్ ఎల్‌బి కాలేజీలో బాల వికాస ఫౌండషన్ ఆధ్వర్యాన సత్కరించారు. ముఖ్య అతిథిగా సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జిఎస్ఎన్.రాజు, అతిథులుగా ఆచార్య బాలమోహన్‌దాస్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులు కెడివి.నరసింహారావు, పి.రాజారావు, పి.నాగేశ్వరరావు, కె.గంగాధరరావు, ఎస్.రాజేంద్రప్రసాద్, కెఎస్‌కె.నాగూర్‌ను సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథి జిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, కృషి, క్రమశిక్షణ, నిజాయతీకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు గుర్తింపు అన్నారు. ఉపాధ్యాయులు మార్గదర్శకంగా మెలగాలని సూచించారు. ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ, ఉపధ్యాయులు కేవలం పుస్తకాల్లోని పాటాలే కాకుండా జనరల్ నాలెడ్జిని కూడా భోదించాలని సూచించారు. డిఇఒ ప్రేమకుమార్ ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. సమావేశానికి బాల వికాస్ ఫౌండషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -తగరపువలస : విద్యా శాఖలో కీలకంగా ఉన్న సిఆర్‌పిల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు హామీ ఇచ్చారు. స్థానిక ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎపి, సిఆర్‌పి ఫెడరేషన్ ఆధ్వర్యాన 'విద్యా శాఖలో సిఆర్‌పిల పాత్ర" అంశంపై ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు నిర్వహించారు. సదస్సుకు చిరంజీవిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యా శాఖలో పలు కార్యక్రమాల అమలులో ముఖ్య పాత్ర వహిస్తున్న సిఆర్‌పిలకు కూటమి ప్రభుత్వంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వేతనాలు పెంపుదలకు ప్రయత్నిస్తానన్నారు. గత ఐదేళ్ల క్రితం సిఆర్‌పిలకు అప్పటి టిడిపి ప్రభుత్వం అనేక అలవెన్స్‌లు ఇచ్చినట్లు వివరించారు. ఎపి సిఆర్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం జాబ్ చార్ట్ లేకుండా చేసిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సిఆర్‌పి లకు న్యాయం చేయాలని కోరారు. ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు తవిటినాయుడు మాట్లాడుతూ, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఫెడరేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు గౌరి, చిన్ని, చిరంజీవి, అనురాధ, లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దంతరక్షణపై ఫ్లాష్ మాబ్

ప్రజాశక్తి-మధురవాడ : బాలలలో నోటి ఆరోగ్య ప్రాధాన్యత గురించి అవగాహన కలిగించడానికి గీతం దంతకళాశాల, ఆసుపత్రి వైద్యవిదార్థుల ఆధ్వర్యాన ఆదివారం స్థానిక వైఎంసిఎ వద్ద ఫ్లాష్ మాబ్, వీధినాటిక, ప్రసంగ కార్యక్రమాలను నిర్వహించారు. గీతం దంతకళాశాల, ఆసుపత్రి పీడియాట్రిక్స్, ప్రివెంటివ్ డెంటిస్ట్రీ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల దంత సంరక్షణ, ఆరోగ్యకరమైన పద్ధతులు, బ్రష్ చేసుకునే విధానంపై వైద్యులు ప్రసంగించారు. అందమైన, ఆరోగ్యకరమైన దంతాలు పూర్తి ఆరోగ్యానికి చాలా అవసరమైనవని, ముఖ్యంగా పిల్లలు తినడం, మాట్లాడటంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయని వారు తెలిపారు. బలహీనమైన దంతాలు, అపరిశుభ్రమైన నోరు కారణంగా రకరకాల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు, క్యావిటీస్ తదితర సమస్యలు వస్తుంటాయని, దంతాలు ఊడిపోవడం, వాటి అరమరిక విషయంలోనూ సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని వీటిపై పిల్లలకు అవగాహన అవసరమని తెలిపారు. నగరంలోని పాఠశాలల విద్యార్థుల దంత రక్షణ కోసం "శిశు గీతం" అనే కార్యక్రమాన్ని గత 15 రోజులుగా నిర్వహించామని, బాలలలో నోటి ఆరోగ్య ప్రాధాన్యతను పెంపొందించడానికి ఉద్దేశించబడిన ఈ కార్యక్రమంలో 20కి పైగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించినట్లు గీతం దంతకళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపల్ డాక్టర్ వివి.నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ సిఎస్.శ్రీనివాస్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలపై పోరాటాలు

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేపట్టనున్నట్టు విశాఖ కో - ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 21 నుంచి నిరాహార దీక్షలు చేపట్టనున్నామన్నారు. విశాఖ డెయిరీలో 1979లో సిఐటియు యూనియన్ ఏర్పాటు చేశామని, నాడు సిఐటియు చేసిన అగ్రిమెంట్ కారణంగా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా విశాఖ డెయిరీలో కార్మికులకు జీతభత్యాలు ఉండేవన్నారు. దీనిని చూసి మిగతా డెయిరీల్లోని కార్మికులు కూడా కార్మిక హక్కులు సాధించుకున్నారని తెలిపారు. నేడు విశాఖ డెయిరీలో 20 సంవత్సరాలుగా యూనియన్ లేకపోవడంతో కార్మికుల హక్కులు అణచివేతకు గురవుతున్నాయన్నారు. పర్మినెంట్ కార్మికులుగా పనిచేయాల్సిన వారు కాంట్రాక్టు లేబర్, ట్రైనీ అగ్రిమెంట్ ఉద్యోగులు, ఇలా.. రకరకాల పేర్లతో తక్కువ జీతాలకు పనిచేస్తున్నారన్నారు. గడిచిన 20 సంవత్సరాలుగా యాజమాన్యం కార్మిక సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేసిందన్నారు. సంఘం పెట్టుకునే హక్కు లేదని చెప్పడం తగదన్నారు. ఏడుగురు వ్యక్తులు ఉంటే ట్రేడ్ యూనియన్ పెట్టుకునే హక్కు ఉందన్నారు. డిమాండ్లను నెరవేర్చాలని కోరితే యూనియన్ లేకుండా కార్మికులు రావాలని చెప్పడం సరికాదన్నారు. డెయిరీలో చేస్తున్న పోరాటంలో కార్మికులతో పాటు రైతులను కూడా కలుపుకుని ముందుకుపోవాలన్నారు. డెయిరీలో కొంతమంది డైరెక్టర్లు సంఘం డబ్బును దోచుకు తింటున్నారని విమర్శించారు. విశాఖ డెయిరీలో కార్మికులకు ప్రమోషన్ పాలసీ లేదని, ఫీల్డ్ వర్క్‌లో సరైన పని గంటలు లేవని తెలిపారు. ఇక్కడి కార్మికులను యాజమాన్యం దోచుకుంటోందన్నారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ఈ నెల 24న కార్మిక సమస్యలపై పెద్ద ఎత్తున సభ పెడుతున్నట్లు తెలిపారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. విశాఖ డెయిరీ సిఐటియు యూనియన్ నాయకులు బి.అప్పారావు మాట్లాడుతూ సంఘం ఉన్నప్పుడే డెయిరీలో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవి.మూర్తి, ఎస్.రమణ, ఉపాధ్యక్షులు ఎ.నరసన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.నాయుడు, ఎల్‌విఎం.నాయుడు, ఎస్.త్రినాధరావు, కె.సత్యనారాయణ, వి.సతీష్ కుమార్, ఎన్.రాజేంద్రప్రసాద్, విశాఖ డెయిరీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.రాంబాబు, సీనియర్ ప్రెసిడెంట్ పి.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి దాడి నాగ మరణి బాబు, గొంతు మూర్తి, నాగేశ్వరరావు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత డెయిరీలో పనిచేసి చనిపోయిన డి.శారద, రాంప్రకాష్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : క్రీడాకారులు ఎల్లవేళలా క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. 29వ వార్డు పరిధి మహారాణిపేటలోని ఆంధ్ర మెడికల్ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలలో విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాను రాను క్రీడా స్ఫూర్తి తగ్గుతోందన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.